మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

# స్థానిక ఎన్నికల్లో అనుబంధ విభాగాలు కీలక పాత్ర పోషించాలి

## వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**తాడేపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అనుబంధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, గ్రామస్థాయి వరకు పార్టీ శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ప్రతి విభాగం తనకు సంబంధించిన ప్రజా సమస్యలను గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయి వరకు విస్తరించాలని సూచించారు.

### నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వంటి ప్రతి దశలో పార్టీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సజ్జల సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాల జారీలో జాప్యం, నామినేషన్లకు అడ్డంకులు, పోలీసుల ద్వారా అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి స్థానానికి ఒక అభ్యర్థితోనే సరిపెట్టకుండా రెండు మూడు ప్రత్యామ్నాయాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నామినేషన్ల నుంచి



బ్యాలెట్ బాక్సుల భద్రత వరకు ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు.

### సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీకి రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బలమైన అర్గనైజేషనల్ నెట్‌వర్క్ ఉందని సజ్జల పేర్కొన్నారు. మహిళలు, యువత, విద్యార్థులు, రైతులు, బీసీలు, ఎస్సీలు, మైనారిటీలు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అయా అనుబంధ విభాగాలు గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, యువత ఉపాధి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఎరువులు, విత్తనాలు, ఉద్యోగుల సమస్యలు, నిత్యావసర ధరలు, పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు.



### 11 లక్షల అనుబంధ విభాగాల శక్తిని వినియోగించాలి: ఆలూరు సాంబశివారెడ్డి

వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జి ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత వ్యవస్థలో దాదాపు 14 లక్షల మంది ఉండగా, అనుబంధ విభాగాల ద్వారా ఉన్న శక్తిని గ్రామస్థాయి వరకు వినియోగించుకోవాలని అన్నారు. ప్రచారం, సోషల్ మీడియా, బూత్ నిర్వహణ, అభ్యర్థుల ప్రచారం, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో ఈ విభాగాలు కీలకంగా పనిచేయాలని సూచించారు. ప్రతి విభాగం తనకు సంబంధించిన సమస్యలపై చిన్న వీడియోలు, డిజిటల్ కంటెంట్ రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.



### ప్రధాన పాత్ర పోషించాలి: లేళ్ల అప్పిరెడ్డి

వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో మహిళా, యువజన, విద్యార్థి, రైతు, బీసీ, ఎస్సీ తదితర అనుబంధ విభాగాలు ప్రజా సమస్యలపై నిర్వహించిన కార్యక్రమాలను అభినందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారం నుంచి అభ్యర్థులకు సహకారం, బూత్ ఏజెంట్ల బాధ్యతలు, కౌంటింగ్ వరకు అనుబంధ విభాగాలు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు సమన్వయంతో పనిచేసి పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



### మహిళలు, ప్రజా సమస్యలను సోషల్ మీడియాలో విస్తృతంగా తీసుకెళ్లాలి: వరుదు కళ్యాణి

వైయస్ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వన్ మినిట్ రీల్స్, చిన్న వీడియోల ద్వారా ఎన్నికల హామీల అమలు పరిస్థితి, ప్రజా సమస్యలను వివరించాలని అన్నారు. మహిళా విభాగం ఇప్పటికే మహిళల సమస్యలపై పలు కార్యక్రమాలు నిర్వహించిందని, ఇతర అనుబంధ విభాగాల కార్యక్రమాల్లోనూ మహిళలు చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకత్వం అప్పగించే బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

Main Edition
12 Oct 2026 Page No. 5